క్లుప్తంగా

13న భీమడోలులో జాతీయ లోక్ అదాలత్


ఎస్ ప్రియదర్శిని

ఏలూరు (టూటౌన్): భీమడోలు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ భీమడోలు కోర్టులో నిర్వహించనున్నట్లు భీమడోలు మండలి లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్, సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎస్ ప్రియదర్శిని సూతక్కి తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు దెందులూరు, భీమడోలు, ద్వారకాతిరుమల మండలాలకు సంబంధించి రాజీ యోగ్యమైన అన్ని క్రిమినల్, సివిల్, కుటుంబ, చెక్ బౌన్స్, చిట్, ఫైనాన్స్, టెలిఫోన్, ఇంటి, నీటి పన్నులకు సంబంధించిన కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు న్యాయవాది ద్వారా లేదా టోల్ ఫ్రీ నంబర్ 15100లో సంప్రదించవచ్చని వివరించారు.

డీఎస్సీపై కూటమి దగా


ముంగర సంజీవ్‌కుమార్

దెందులూరు: డీఎస్సీ విషయంలో కూటమి ప్రభుత్వం మొదటి నుంచి మోసపూరిత విధంగానే వ్యవహరిస్తుందని ఇది మెగా డీఎస్సీ కాదని దగా డీఎస్సీ అని వైఎస్సార్ సీపీ వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్ అన్నారు. సోమవారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 16,347 పోస్టుల భర్తీలకుగాను ఆన్‌లైన్‌లో కేవలం 10 వేల మందికి మాత్రమే కాల్ లెటర్లు పంపడం వెనుక కూటమి ప్రభుత్వం ఆంతర్యం ఏమిటన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందన్నారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ


సామాజిక తనిఖీ చేస్తున్న ఏపీడీ మల్లిఖార్జునరావు

గణపవరం: గణపవరం మండల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ 18వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ తణుకు ఏపీడీ, గణపవరం మండల ప్రత్యేక అధికారి జీవీ మల్లిఖార్జునరావు పాల్గొన్నారు. సిబ్బంది, డీఆర్‌పీలు నివేదికలు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ సత్యనారాయణ, పంచాయతీరాజ్ ఏఈ కె.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన గుజరాత్ బృందం


కొవ్వలి ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న గుజరాత్ బృందం

దెందులూరు: కొవ్వలి పీఎంశ్రీ జెడ్పీ హైస్కూల్‌ను సోమవారం గుజరాత్ ఐఏఎస్ బృందం రంజిత్ కుమార్ నేతృత్వంలో సందర్శించారు. పీఎంశ్రీలో భాగంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అగ్రికల్చర్, ఆటోమోటిక్, బీఎఫ్ఎస్ఐ లాబ్స్, పీఏఎల్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించారు. స్కౌట్స్, గైడ్స్ ఆక్టివిటీస్‌ను పరిశీలించి, మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. వారి వెంట సమగ్ర శిక్ష ఏఎస్‌పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఏలూరు జిల్లా ఏపీఎస్ పంకజ్ కుమార్, ఏఎంఓ ఆర్.రామారావు, ఎంఈఓ ఏపీఎస్‌పీ ప్రసాద్, ఎంఈఓ-2 కె..అన్నమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ బి.గణేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రహదారి లేక రైల్వే ప్రయాణికుల ఇక్కట్లు


రైల్వే ట్రాక్ వెంబడి నడుస్తున్న ప్రయాణికులు

ఉంగుటూరు: మండలంలో ప్రజలకు ప్రస్తుతం ఉన్న ప్రధాన రైల్వే స్టేషన్ చేబ్రోలులో ఉంది. ఇక్కడ ఆగే అరకొర రైళ్ల ప్రయాణికులు బయటకు రావడానికి లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. ప్రమాదానికి ఎదురెళ్లినట్లు ప్లాట్‌ఫాం మీద రైలు దిగిన ప్రయాణికులు ట్రాక్ వెంబడి నడుచుకుంటూ వెళుతున్నారు. దీంతో ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్లాట్‌ఫాం మీదకు చేరుకోవడానికి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రైల్వే శాఖ ఇంజనీర్లు ప్రయాణికుల శ్రేయస్సు దృష్ట్యా రహదారి నిర్మించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా వినాయకుని నిమజ్జనం


భీమడోలు: సూరప్పగూడెంలో బాల గణనాధుని ఊరేగిస్తున్న కమిటి సభ్యులు


దెందులూరు: స్వామి వారి ప్రసాదాన్ని అందుకుంటున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని

ఉంగుటూరు: మండలంలో వినాయకుని ఊరేగింపు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉంగుటూరు, కైకరం, నారాయణపురం, చేబ్రోలు, గొల్లగూడెం, రాచూరు తదితర గ్రామాల్లో వినాయకుని ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు. ఆలయాల కమిటీ సభ్యులు, యువకులు ఊరేగింపులో సందడి చేశారు. ఓ వైపు బాణసంచా కాల్పులు, మరో వైపు యువకుల డ్యాన్సులతో ఊరేగింపులు కొనసాగాయి. నారాయణపురంలో వివేకనంద పాఠశాల విద్యార్థులు వినాయకుడిని ఊరేగించారు. పాఠశాల కరస్పాండెంట్ గుణ్ణం బుల్లబ్బాయి, నరేష్ ,గీతా రాణి, సుధా తదితరులు పాల్గొన్నారు.


నిడమర్రు: శ్రీరాంపురం గౌరీదేవి ఆలయంలో నిమజ్జనానికి సిద్ధం చేస్తున్న వినాయక విగ్రహం


గణపవరం: వెలంపేట వినాయకుడిని ఊరేగిస్తున్న భక్తులు

వినాయకుని లడ్డూ వేలం పాట

దెందులూరు: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గ్రామ గ్రామాన నిమజ్జనాలు ఊరేగింపులు స్వామివారి లడ్డూ వేలం పాట జరిగాయి. శ్రీరామవరం గ్రామంలో స్వామివారి లడ్డు వేలం పాటను వైఎస్సార్‌సీపీ నేత మయూరి శ్రీను దక్కించుకున్నారు. స్వామివారి ప్రసాదాన్ని పార్టీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు కామిరెడ్డి నాని, గ్రామ నాయకులు గ్రామస్తులకు పంపిణీ చేశారు. గోపన్నపాలెంలో శ్రీబాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర స్వామి ఆలయం ముందు కన్వీనర్స్ మోదుగు యశ్వంత్ కుమార్, కర్రి శ్రీరామ్ కమిటీ సభ్యులు వేలాది దీపాలతో విఘ్నేశ్వర స్వామి చిత్రం తోపాటు ఓంకారం ఇతర దేవత చిత్రాలను దీపోత్సవం నిర్వహించారు. దీపోత్సవం కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు గ్రామంలోని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గణేశుని నిమజ్జనాలు తనిఖీ చేసిన ఎస్పీ

వినాయక చవితి ఉత్సవాలు నిమజ్జనాలను జిల్లా ఎస్పీ కే. ప్రతాప శివ కిషోర్ సోమవారం దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లోని గ్రామాల్లో స్వయంగా తనిఖీచేశారు. ఊరేగింపులు జరుగుతున్న తీరు నిబంధనలు అమలు నిమర్జనాలు కార్యక్రమంలో ఎటువంటి అపశృతి జరగకుండా చేసిన పటిష్టమైన ఏర్పాట్లుపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో దెందులూరు, ఉండ్రాజవరం, పోతునూరు గ్రామాల్లో ఏలూరు రూరల్ మండలంలో తూర్పులాకులు ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. ఆయనవెంట డీఎస్పీ, సీఐ, ఎస్సైలు ఉన్నారు.


దెందులూరు: వినాయక నిమజ్జనాల ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్పీ శివకిషోర్


ఉంగుటూరు: నారాయణపురంలో వినాయకుని ఊరేగింపు నిర్వహిస్తున్న విద్యార్థులు

కోలాహలంగా వినాయకుని నిమజ్జనం

నిడమర్రు: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు సోమవారం కోలాహలంగా నిర్వహించారు. గణపతి ఉత్సవాల్లో భాగంగా గణనాధుని విగ్రహాలను భారీ ఊరేగింపుల నడుమ తరలించారు. నిడమర్రు, బువ్వనపల్లి, అడవికొలను గ్రామాల్లోని విగ్రహాలను కాపవరం కాలువలో నిమజ్జనం చేసారు. తోకపల్లిగ్రామంలోని విగ్రహాలను పందికోడు కాలువలోనూ, శ్రీరాంపురం గ్రామంలోని విగ్రహాలను చిన కాపవరం పంటకాలువల్లో నిమజ్జనాలు నిర్వహించారు. ఆయా విగ్రహాల వేదికల వద్ద బుధవారం భారీ అన్నసమారాధనలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.

వైభవంగా ఊరేగింపులు, ఉత్సవాలు

భీమడోలు: మండలవ్యాప్తంగా వినాయకచవితి ఉత్సవాల్లో సోమవారం గణనాధుని ఊరేగింపులు, నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. భీమడోలు, సూరప్పగూడెం తదితర గ్రామాల్లో భక్తులతో పూజలందుకున్న లంబోదరుని విగ్రహాలను ఊరేగించారు. మడోలులోని గణపతి సెంటర్‌లోని శ్రీమన్మహా గణనాధుని ఉత్సవాల్లో ఆరోరోజు చిలకాకుపచ్చ వర్ణంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. సూరప్పగూడెంలోని బాల గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బాల గణపతి యూత్ స్వామిని ఊరే గించారు. భీమడోలు జంక్షన్‌లోని శ్రీహరినగర్ కాలనీలో వేంచేసియున్న శ్రీమహాలక్ష్మీ గణపతి స్వామి వారి ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటి ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలు ఎఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి, గ్రామ కార్యదర్శి కేవీఎల్ తనూజ తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో..

గణపవరం: గణనాథులు నిమజ్జనానికి అట్టహాసంగా తరలుతున్నారు. భారీ ఊరేగింపులతో వినాయక విగ్రహాలను పూలతో అలంకరించిన వాహనాలలో గ్రామంలో ఊరేగించి నిమజ్జనంచేశారు. సోమవారం గణపవరం నిడమర్రు మండలాలల్లోని గణనాథులను నిమజ్జనం చేశారు. గణపవరం వెలంపేట, మసీదు వీధులలోని గణనాధులను భారీ ఊరేగింపులతో గ్రామంలో వీధివీధినా ఊరేగించారు. బువ్వనపల్లి కొత్త వైఎస్ఆర్ కాలనీలో వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఉంగుటూరు: మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండలంలోని కంసాలిగుంట గ్రామంలో ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు స్మార్ట్ రేషన్‌కార్డులను లబ్ధిదారులకు వారి ఇంటి వద్దే అందజేశారు.

21,579 స్మార్ట్ రేషన్ కార్డులు

దెందులూరు: మండలంలో అన్నిగ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభమైందని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ దెందులూరు మండలానికి 21579స్మార్ట్ రేషన్‌కార్డులు వచ్చాయన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్‌ఓలు, రేషన్ డీలర్లు, వీఆర్ఏలు, నాయకులు పంపిణీ కార్యక్రమం చేపట్టారన్నారు.

పెదవేగిలో..

పెదవేగి: మండలంలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారుల ఇంటి వద్దకే అందించే విధంగా స్థానిక సచివాలయ సిబ్బందికి బాధ్యతలు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు సచివాలయ సిబ్బంది, రేషన్ డీలర్లు ఇంటింటికీ తిరిగి లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకొని స్మార్ట్ రేషన్ కార్డులను అందించనున్నట్లు వారు తెలిపారు.

సంస్కృతంలో డాక్టరేట్

పెదపాడు: సంస్కృత ఉపాధ్యాయురాలు స్వాతికి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించిందని అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పావతి తెలిపారు. సోమవారం పాఠశాలలో స్వాతిని ఉపాధ్యాయులు, హెచ్ఎం అభినందించారు.

గణపవరాన్ని పశ్చిమలోనే కొనసాగించాలి

ఉంగుటూరు: గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోనే ఉంచాలని గణపవరం మండలం నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే పత్స మట్ల ధర్మరాజును ఉంగుటూరు క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందిచారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు ఇందుకూరి రామకృష్ణంరాజు, పాతపాటి హరికుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

గణపవరం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తద్వారా శారీరక, మానసిక దృఢత్వం కలుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. సోమవారం కాలేజీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు క్రీడల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ కేవీ గణేష్ కుమార్, శ్రీనివాసరావు, సీహెచ్ చైతన్య, ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికా రి వెంకట రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు మహానేత వైఎస్సార్ వర్ధంతి

దెందులూరు: మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి మంగళవారం దెందులూరు నియోజకవర్గంలో నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిగా ఆరోగ్యశ్రీ సృష్టికర్తగా దేశ వ్యాప్తంగా పేరు గడించిన ప్రజా నాయకుడని అన్నారు. ఈ సందర్భంగా రోగులకు పళ్ల పంపిణీ, పలు కార్యక్రమాలు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ అన్ని విభాగాల నాయకులు కార్యకర్తలు, అభిమానులకు అబ్బయ్య చౌదరి సూచించారు.

మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతికి ఏర్పాట్లు

నిడమర్రు: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు మంగళవారం నిర్వహించేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, వైస్ అభిమానులు పలు గ్రామాల్లో సోమ వారం ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లోని విగ్రహాలకు రంగులు వేయించడం, నీటితో శుభ్రం చేయడం, వైఎస్సార్ సీపీ జెండాలు, పూలతో అలంకరించడం వంటి కార్యాక్రమాలు చేపట్టారు.



దెందులూరు: మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న కార్యకర్తలు


నిడమర్రు: మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని సిద్ధం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఆయా గ్రామాల్లో పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

గణపవరంలో..

గణపవరం: ఈ నెల 2వ తేదీ మంగళవారం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు ఉంగుటూరు నియోజకవర్గంలో నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబు పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చారు. సోమవారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల రూపకర్త వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా గ్రామాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. తాను ఉంగుటూరులో నిర్వహించే వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.

యువతకు ఉచిత శిక్షణ

పెదపాడు: యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ రిపేర్స్‌పై యువతకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఏలూరు ప్రతినిధి తెలిపారు. మండలంలోని వట్లూరులోని యూనియన్ బ్యాంకు ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ఉచిత భోజన వసతి, ఉచిత మెటీరియల్ అందించనున్నట్లు తెలిపారు.

గణపవరంలో భారీ వర్షం

గణపవరం: గణపవరంలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండ, ఉక్కపోతతో ఉన్న వాతావరణం, సాయంత్రం 4 గంటలకు ఉన్నట్టుండి ఒక్కసారిగా మబ్బులు కమ్మి భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు ఏకధాటిగా వర్షం కురవడంతో జనసంచారం స్తంభించిపోయింది. రోడ్లమీదకు వర్షపునీరు చేరాయి. సోమవారం గణపవరంలో జరిగే వారపు సంతకు వర్షం తీవ్ర నష్టం కలిగించిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. రద్దీ సమయంలో వర్షం పడటంతో ప్రజలు సంతకు రాలేదని, దీని వలన తమ వ్యాపారాలు అంతంత మాత్రంగానే సాగాయంటున్నారు. ఇక నాలుగు రోజులుగా తెరిపి ఇవ్వడంతో కోలుకుంటున్న సార్వా పైరు ఈ వర్షం కారణంగా మళ్లీ నీటమునిగింది. అల్పపీడన ప్రభావంతో మరో 4 రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించడంతో ఇక వరి కోలుకునే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.


రోడ్డు మీద నిలిచిన వర్షపు నీరు

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు


బాల్య వివాహాలపై నాటిక ప్రదర్శన చేస్తున్న దృశ్యం

పెదవేగి: ప్రభుత్వం నిర్దేశించిన వయస్సు దాటకుండా బాల్య వివాహాలు చేసుకుంటే చట్టరీత్యా నేరమని పెదవేగి సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి అన్నారు. మండలంలోని పెదవేగి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్-క్రాఫ్ ఆధ్వర్యంలో స్కూలు ప్రధానోపాధ్యాయుల సహకారంతో బాల్య వివాహాల వ్యతిరేక ప్రచారోద్యమం వీధి నాటిక ప్రదర్శించారు. ఈ సందర్భంగా పెదపాడు సెక్టార్ సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ గ్రామంలోని ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండకుండా మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమన్నారు.కార్యక్రమంలో హెచ్ఎం టీవీ సత్యనారాయణ, క్రాఫ్ సిబ్బంది, ఆర్.వినోద్‌కుమార్, జి రాజలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల వేగాన్ని నియంత్రించాలి

భీమడోలు: జాతీయ రహదారి భీమడోలు కనకదుర్గమ్మ గుడి వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు అవసరమైన స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని భీమడోలు ఎంపీటీసీ, రాష్ట్ర వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ మండల స్థాయి అధికారులను కోరారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో భీమడోలు కనకదుర్గమ్మ ఆలయంవద్ద తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, క్షతగాత్రులవుతున్నారని, కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవిలకు వినతిపత్రం అందించారు. రైల్వే గేటు సమీపంలోని కనకదుర్గమ్మ గుడి వద్ద డివైడర్‌నుంచి వాహనదారులు రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వలన రోడ్డు ప్రమాదాలకు బలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డివైడర్ మీదుగా భీమడోలు, చినలింగంపాడు, పెదలింగంపాడు, సాధుగారిదిబ్బ గ్రామాల ప్రజలు, రైతులు ఈ డివైడర్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారని, ఇది రాంగ్‌రూట్ కావడం వల్ల తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఇకనైనా డివైడర్ వద్ద స్టాపర్లు ఏర్పాటుతోపాటు హోంగార్డును నియమించి, వాహనాల వేగాన్ని నియంత్రించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.


తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి

కుంగిన రహదారితో అవస్థలు


కుంగిపోయిన సీసీ రహదారి

నిడమర్రు: బావాయిపాలెంలో ప్రధాన రహదారిని అనుకుని ఉన్న కొల్లేరు రోడ్డు కుంగిపోవడంతో స్థానిక ప్రజలు, రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి జిల్లా పరిషత్ నిధులతో నిర్మించడంతో జిల్లా పరిషత్ రోడ్డుగా పిలుస్తారు. బావాయిపాలెంలో సగం కుటుంబాలకు ఇదే ప్రధాన మార్గం, అలాగే ఇది ఎల్లమ్మ చెరువు ప్రాంతానికి, కొల్లేరు వెళ్లేందుకు మార్గం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. ఈ మార్గం పలు చోట్ల మలుపుల్లో కుంగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించేందుకు నానాతంటాలు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి మలుపుల్లో రహదారి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.